


# పరస్పరం

భైరవమూర్తి పెళ్ళయిన కొత్తలో చాలా సంతోషించేవాడు. (చాలా అసంబద్ధమైన వాక్య నిర్మాణం ఇది. అయినా రచయిత చెప్పదల్చుకున్నది పాఠకులకి అర్థం అయిందికదా ! చాలు- వ్యాఖ్యాత) అతడు అందరితోను మామూలుగానే వుండేవాడు. కానీ ఆలోచన్లు మాత్రం విచిత్రంగా వుండేవి.

అతడో రకంగా సైకోఫాథిక్. (అంటే అనాచరణాయోగ్య బాహ్య స్వరూప ప్రకటిత మనస్కుడు...పబ్లిషర్) అయితే ఇది తక్కువమోతాదులో వుండటంవల్ల ఎవరికీ తెలిసేది కాదు.

తను ఒంటరివాడినన్న భావం అడాల్‌సెన్స్‌లో ప్రతివాడికీ ఉంటుంది. అయితే వయస్సు పెరిగేకొద్దీ ఏర్పడే వ్యాపకాల్తో యిది పోతుంది (ఈ ఒంటరితనం అనేది జంట దొరగ్గానే పోతుందని చాలామంది అనుకొంటారు కానీ అది తప్పు... పబ్లిషర్.)

భైరవమూర్తికి సంబంధించినంత వరకూ వయస్సు పెరిగినా ఆ ఒంటరితనం పోలేదు. కారణం అతడికి మరేం వ్యాపకమూ లేకపోవటమే. ఆఫీసునుంచి వచ్చి, స్నానంచేసి, రూమ్ బయట కుర్చీవేసుకొని రాత్రి ఎనిమిదిన్నర వరకూ సినిమా పత్రికలూ, వారపత్రికలూ చదివేవాడు. అతడికి ఇవన్నీ చౌకబారుగా కనిపించేవి. అయినా పది సంవత్సరాలనుంచీ చదువుతున్నాడు (దీన్ని పారనాయిక్ సైకాలజీ అంటారు.)

ఆ తరువాత అతడు భోంచేసి మళ్ళీబయట కూర్చొనేవాడు. చీకట్లో ఆకాశంకేసి చూస్తూ శూన్యత గురించి ఆలోచించేవాడు. మిగతా ప్రజలంతా ఏదో అజ్ఞానంతో వేగిపోతున్నట్టు- తన లాజికల్ ఐడియలిజంని (భావ ప్రధాన తార్కిక వివరణాన్ని) వాళ్ళు అర్థం చేసుకోలేకపోతున్నందుకూ- విచారించేవాడు.

స్నేహితులతో కలసి ముందు కెడుతున్నప్పుడు కూడా అతడు వాళ్ళ గురించే బాధపడేవాడు. తన సంగతి వేరు. ఇళ్ళల్లో భార్యల్ని వదలి రాత్రి

పదకొండింటివరకు యిలా ఎందుకు గడుపుతారో అర్థం అయ్యేదికాదు. ప్రేమ, ఆప్యాయతా, కళ్ళల్లో చూసుకోవటం, యుగాలు క్షణాలుగా మారటం... ఇలాంటివాటి గురించి ఆలోచించేవాడు ఇంకోరకంగా కూడా వుండేవి అతని ఆలోచన్లు అతడు తాగుడికి బాగా బానిస అయిపోయినట్టు-భార్య దుఃఖాన్ని గుండెల్లో (చాలా బరువయిన పదం ఇది - వ్యాఖ్యాత) దాచుకొని, బేలగా తనవైపు చూస్తూన్నట్టూ తను ఇంకా పాడయిపోయినట్టూ కలగనేవాడు అయితే యీ కల ముగింపు గొప్పగా వుండేవి. ఒకరోజున హఠాత్తుగా అతడికి జ్ఞానోదయ మయ్యేది. భార్యని హృదయానికి హత్తుకొని "క్షమించు సీతా, ఈరోజే తెలిసింది ఇన్నాళ్ళూ నిన్నెంతబాధపెట్టానో! ఈ క్షణంనుంచి మన చుట్టూవున్న చీకటి తెరలు తొలగిపోయేయి సీతా. ఇక అంతా ఆనందమే!!" అనేవాడు ఆవేశంతో. ఆమె కళ్ళనిండా నీళ్ళతో "ఇదంతా నా మంగళసూత్రం చేసుకున్న భాగ్యమండీ" అనేది చాలా డ్రెమటిక్‌గా. ఆ మరుసటిరోజే దీపావళి వచ్చింది. పిల్లల్తో కలసి ఆనందంగా టపాకాయలు కాలుస్తున్న భర్తనిచూసి సీత పాడురోజులు పోయాయి కదా అని సంతోషపడేది... ఇలా ఉండేవి అతని ఆలోచన్లు.

భైరవమూర్తి ఆఫీసులో అమ్మాయి లెక్కువ. అతడు పనిచేసేది స్టేషనరీ డిపార్టుమెంట్‌లో కాబట్టి వాళ్ళు ఇతడితో నవ్వుతూ మట్లాడే వారు. (తెల్ల కాగితాల కోసమా?) వాళ్ళతో మాట్లాడుతూ ఇతడు తెగ భాధ పడిపోయేవాడు. "అయ్యో... పెళ్ళికావాల్సిన అమ్మాయి యిలా పరాయి మొగవాడితో మాట్లాడి చెడిపోతుందే" అని (మరి ఇతడికి పెళ్ళికాలేదు కదండీ...)

భైరవమూర్తికి ఇరవై ఎనిమిదో ఏడు నిండుతూ వుండగా అతడి జీవితం మలుపు తిరిగింది. ఎవరూ సాధించలేని గొప్ప విజయాన్ని సాధించేడు. హీరో అయ్యాడు. అది అతడి పెళ్ళి!

ఎవడి పెళ్ళిలో వాడు హీరోయే కదా!

* * *

ఆ తరువాత భైరవమూర్తి కనపడలేదు.

అంటే కనబడకుండా పోవటం అనికాదు- బయట కనిపించలేదు అని. ఆఫీసు అవగానే ఇంటికి పరుగెత్తుకుంటూ వచ్చేవాడు. ఆఫీసులో వుండగా ఎప్పుడూ గడియారంవంక చూస్తూ ఉండేవాడు. బయట ప్రజల్తో కలవడం మానేశాడు. క్యాజువల్లీవులన్నీ వాడేసుకొన్నాడు. తొందరగా ఇంటికి వెళ్ళగలిగే పర్మిషన్లన్నీ సూపర్నెండెంటు ఇక ఇవ్వననే వరకూ వాడేశాడు.

ఇలా ఓ మూడునెలలు గడిచేయి.

ఒకరోజు షికారుకి వెళ్ళటానికి తయారవుతున్నారు భార్యాభర్తలు. ఆమె అద్దంముందు అలంకరించుకొంటూంటే చూస్తున్న మూర్తి "రాధా" అన్నాడు.

ఆమె తలతిప్పి చూసింది.

"నువ్వు చెవులకు రింగులు పెట్టుకోవడం మానేసి, దుద్దులు పెట్టుకో కూడదూ" అన్నాడు.

రాధ నవ్వి "దుద్దులు ఓల్డ్ ఫేషనండీ" అంది.

"అయినా వాటిలో వున్న అందం ఈ రింగులలో ఏముంది చెప్పు" అన్నాడు. ఆమె అతని వైపు ఆప్యాయంగా చూసి "సర్లేండి మీకేది ఇష్ట మయితే నాకూ అది ఇష్టమే" అని ఆ రింగుల్ని పెట్టెఅడుగున పారేసింది. ఇంట్లో తల్లి వుంది కాబట్టి ఆగిపోయాడు కానీ లేకపోతే ఆ క్షణం ఆమెని ఉక్కిరి బిక్కిరి చేసేవాడు.

ఇది జరిగిన కొన్నాళ్ళకి ఓ స్నేహితుడికి ప్రమోషనొచ్చి పార్టీ

ఇచ్చేడు. అందులో ఎంత బలవంతం చేసినా భైరవమూర్తి మందు ముట్టుకోలేదు. "వద్దు బ్రదర్" అనేశాడు.

"అదేమిటి గురూ... అంతకు ముందు తాగే వాడివిగా" అన్నారు స్నేహితులు. అతడేదో మాట మార్చటానికి ప్రయత్నించేడు, కాని కుదర్లేదు. నసుగుతూ "మా ఆవిడకి ఆ వాసన పడదోయ్" అన్నాడు.

ఆ గది నవ్వులతో ప్రతిధ్వనించింది

"మా ఆవిడకి ఈ వాసన పడదోయ్, అందుకని మానేస్తామా ? మందు కొట్టేయ్ తరువాత మొహం టూత్‌పేస్ట్‌తో కడుక్కో. కిళ్ళీ వేసుకో, బ్రహ్మ వచ్చినా పట్టుకోలేడు" అన్నాడో స్నేహితుడు.

"చాక్లెట్ అయితే మంచిది" స్వానుభవంతో చెప్పేడు ఇంకొకడు.

"వద్దోయ్" అన్నాడు భైరవమూర్తి "పరస్పరం అలా మోసం చేసుకొంటే ఇక భార్యాభర్తల మధ్య అవగాహన నేముంటుంది ?

ఇక్కడడిస్కషనురసవత్తరంగా, కొంచెం తెలివితేటలుగా నడిచింది.

"ఇందులో మోసం ఏముంది ? నువ్వేమీ ద్రోహం చెయ్యటం లేదుగా ఆవిణ్ని ? నీ సుఖం కోసం నువ్వు ఓ పెగ్గు తాగుతున్నావ్. అది మీ ఆవిడకి ఇష్టంలేదు కాబట్టి ఆవిడ్నించి దాస్తున్నావు 'నొప్పించక తానొవ్వక ఎస్కేపైె తిరుగువాడు ధన్యుడు సుమతీ!' అన్న పద్యం వినలేదూ ? జీవితంలో షైన్ అవ్వాలంటే ఆ మాత్రం లౌకికం వుండాలి బ్రదర్. ఒక్క భార్యే సర్వస్వం అనుకోకూడదు" ఓ అనుభవజ్ఞుడు సలహా ఇచ్చేడు.

"ఆత్మవంచన—" అన్నాడు భైరవమూర్తి.

"చెప్తే ఎక్కువ బాధపడ్తుంది కాబట్టి చెప్పటంలేదు, అంతేగా..."

అతడీ మాటలు ఒప్పుకోలేదు. ఎంత బలవంతం చేసినా ముట్టుకోలేదు. అంతలో స్నేహితుడు తెప్పించిన మందు కూడా వచ్చేసింది. అతడు ఇంటికొచ్చేశాడు.

ఇది జరిగిన రెండ్రోజులకి అతడు ఆఫీసుకు బయల్దేరబోతూ ఉంటే

తల్లి వచ్చి "నేను రేపు వెళ్ళిపోదామను కుంటున్నాన్రా" అంది. అతడు సంతోషాన్ని మొహంలోనే దాచుకొని "అప్పుడే ఎందుకు ?" అన్నాడు.

"మీ నాన్నగారు ఒక్కరే వుంటారు. ఎలావున్నారో ఏమో" అంది.

"సరే అయితే" అన్నాడు.

ఆమె గదిలోంచి వెళ్ళిపోయేక రాధ వచ్చింది– "ఈ రోజు నేనూ అత్తగారు మార్నింగ్ షోకి వెళదామనుకొంటున్నామండీ..." అంటూ.

"దేనికి ?" చొక్కా గుండీలు పెట్టుకుంటూ అడిగేడు.

"బురద రాముడు..."

అతడు పర్సు జేబులో పెట్టుకుంటూ "మిట్ట మధ్యాహ్నపూట ఎండలో ఆ క్యూలో నిలబడి సినిమా చూడకపోతేనేం ?" అన్నాడు.

"పోనీ ఫస్టు షోకి వెళ్దాం మీరూ రండి.." అంది రాధ ఆశగా.

"నేను తెలుగు సినిమాలు చూనడని తెలుసుగా."

"అందుకే మేం వెళ్తున్నది..." అంటూ అతడు తన వైపు చూసేసరికి మాట మధ్యలో ఆపుచేసింది.

"వెళితే వెళ్ళండి, కానీ రూపాయిపావలా టిక్కెట్టుకి కక్కుర్తిపడి వెళ్ళకండి. బాపు సినిమాకయితే వెళ్ళండి. మంచి అభిరుచుల్ని పెంపొందించుకోండి" అనేసి ఆఫీసుకి వెళ్ళిపోయేడు.

అతడు ఆఫీసుకెళ్ళిన అరగంటకి ఎవరో ముఖ్యుడు చాల్చి తన్నేశాడని తెలిసింది. ఆఫీసుకి శలవు. ఇంటివాళ్ళు సినిమాకి వెళ్ళారన్న వార్త గుర్తొచ్చింది. ఏమి చెయ్యాలో తోచలేదు.

అతడి స్నేహితులైన కోలీగ్స్ మధ్యాహ్నమే మందు కొట్టటానికి వెళ్ళిపోయేరు ఒకడి రూమ్‌కి.

అతడు లైబ్రరీకి వెళ్దామని బయల్దేరేడు. సైకిల్ మీద వెళ్తూవుంటే రోడ్డుమీద ట్రాఫిక్ జామ్ అయింది. బురదరాముడి తాలూకు క్యూ రోడ్డు మీదకి వచ్చేసింది. బుకింగ్ దగ్గర ఎవరో కొట్టుకుంటున్నారు. అంతా హడావుడి–రష్. దాంట్లోంచి బైటపడి లైబ్రరీకి వెళ్ళేసరికి పన్నెండయింది. ఒక గంట అక్కడ కూర్చొని ఇంటికొచ్చేడు. అతడింటి కొచ్చిన పది నిమిషాలకి తల్లీ భార్యా సినిమా నుండి వచ్చేరు.

లోపలికి వచ్చేక "ఎలా వుంది సినిమా ?" అని అడిగేడు. బురద రాముడి క్యూలో తల్లినీ భార్యనీ చూసిన దగ్గరనుంచీ అతడి మనసు బావో లేదు క్యాజువల్‌గా అడిగేడు.

"చాలా బావుందండీ" అంది రాధ.

"చిన్నపిల్లలిద్దరూ బాగా చేసేరు."

అతడామెవైపు విచిత్రంగా చూసి "ఏ సినిమా" అన్నాడు.

"స్నేహం."

క్షణంలో వెయ్యోవ వంతుపాటు అతడి దవడ కండరం బిగుసుకొని మళ్ళీ మామూలుగా అయిపోయింది. మొహంలో ఏ భావమూ లేకుండా "ఓహో అలాగా" అన్నాడు.

ఆమె చెవి రింగు అమాయకంగా వూగుతోంది చాలా అందంగా. "రింగు" కదా.

* * *

ఆ రోజు సాయంత్రం అతడు స్నేహితుడి బాత్‌రూమ్ వైపు నడుస్తూ "కాల్గెట్ టూత్ పేస్టు ఉందా గురూ" అని అడుగుతున్నాడు.

[ఈ రచయితకి ప్రతిదీ అస్పష్టంగా వదిలెయ్యటం అలవాటు. అందువల్ల దాన్ని విప్పి చెప్పే బాధ్యత మెమే తీసుకున్నాం.

పరస్పరం మోసం చేసుకోవటం అన్నది మానవజాతిలోనూ, భార్యాభర్తల మధ్యా సర్వసాధారణం అనేది రచయిత ఉద్దేశ్యం అని మా అభిప్రాయం. పరాయి స్త్రీతో తిరిగే మగవాడు భార్యనెంత మోసం చేస్తున్నాడో, భర్త చొక్కా అతడికి తెలియకుండా స్టీలు సామాన్ల వాడికిచ్చే భార్యకూడా అంత మోసమే చేస్తున్నదని రచయిత చెప్పదల్చుకున్నాడు. క్వాంటిటీ మాత్రమే తేడా...వ్యాఖ్యాత]

ఆ తరువాత భైరవమూర్తీ రాధా అరవై సంవత్సరాలు హాయిగా కాపురం చేసేరు.

చాలా మంది లాగే.